ఊహించండి

అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బాగుం టుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.

అమాయకరావు ఒకరోజు పనిమీద పట్నం వెళ్ళాడు. పని పూర్తి అయ్యేసరికి బాగా చీకటి పడింది. తిరిగి తన ఊరు వెళ్ళే చివరి బస్సుకూడా దాటిపోయిందని తెల్సి అతనికేం చెయ్యాలో పాలుపోలేదు. అతనికి పట్నంలో తెలిసిన బంధువులుగాని, స్నేహితులుగాని ఎవ్వరూ లేరు. ఆ రాత్రి తల దాచుకోవడానికి ఎవర్నయినా ఆశ్రయం అడుగుదామని బస్‌స్టాండ్ నుండి ఊర్లోకి వెళ్ళాడు.

ఒక ఇంటి తలుపు తట్టాడు. ఆ ఇంటి ఇల్లాలు తలుపు తెరచి ఏంకావాలి బాబు? అని అడిగింది.

అమాయకరరావు అమాయకంగా జాలిగా ఆమెవైపు చూసి "పొరుగూరు కొంతంగి నుండి వచ్చాను. తెలిసిన వారెవరూ లేరు, దయచేసి ఈరాత్రికి మీ ఇంట్లో పడుకోనిస్తారా?" అని అడిగాడు.

"ఇంట్లో వయసొచ్చిన ఆడపిల్ల ఉంది, నీలాంటి వాళ్ళకి ఆశ్రయం ఇస్తే జరిగే అనర్థాలు చాలా చూసాం" అంటూ దభేలున తలుపు మూసింది.

అమాయకరావు మరో ఇంటికి వెళ్ళి తన అవస్థ చెప్పుకొని ఆశ్రయం అడిగాడు. "ఇంట్లోఉన్న ఆడపిల్లల్ని చూసి ఆశ్రయం పేరుతో నాటకాలాడుతున్నావంటూ" నానా తిట్లుతిట్టి అమాయకరావుని బయటకు తోసాడు ఆ ఇంటి యజమాని.

అలా చాలాచోట్ల వయసొచ్చిన ఆడపిల్ల లుండటం వలన తనకు ఆశ్రయం దొరకడం లేదని తెలుసుకొన్నాడు అమాయకరావు.

చివరి ప్రయత్నంగా ఒక ఇంటికి వెళ్ళి తలుపు తట్టాడు. అది పోలీసాఫీసరు ఇల్లని తనకేం తెలుసు? ఆ పోలీసాఫీసరు తలుపు తీసి "ఏంకావాలి?" అని అమాయకరావుని అడిగాడు.

"మీ ఇంట్లో వయసొచ్చిన ఆడపిల్లలు ఉన్నారా" అన్నాడు అమాయకరావు అమాయకంగా.

అమాయకరావు మాటలకు చిర్రెత్తు కొచ్చింది ఆ పోలీసాఫీసరుకి, అయినా కోపాన్ని దిగ మ్రింగుకొని 'ఎందుకు?' అని అడిగాడు.

"ఈ రాత్రి [కి] పడుకుందామని" అని అమాయకంగా అన్నాడు అమాయకరావు.

ఆ మాటలు పూర్తి కాకుండానే కళ్ళ ముందు నక్షత్రాలు కనిపించాయి. అమాయకరావుకి, పోలీసాఫీసరు కొట్టిన చెబ్బలికి దిమ్మతిరిగి క్రింద పడ్డాడు. మళ్ళీ కళ్ళు తెరచి చూసేసరికి జైలు గదిలో ఉన్నాడు. పాపం! అమాయకరావు.

—బి.ఎల్. నారాయణ
కత్తిపూడి-533455
వయా చెబ్రోలు, తూ.గో. జిల్లా

ప్రవంతి నెం: 24లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి రచయిత్రి : టి. విశాలాక్షి
పెట్టిన పేరు : నగ్నసత్యం.

ఈ వారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ : శ్రీ వి.ఎస్.ఆర్. ఆంజనేయశాస్త్రి

పాతంతా దండగ, కొత్తంతా మంచే అనిపించని చదువు నాది. అహం లేకుండా నిజాయితీతో సామాన్యుడి కోసం రూపాయెత్తు ఆలోచనా సరళితోనైనా రచయిత రాయాలన్న తత్వం నాది. అందుకని అక్షరరూపమైన ఏ రచనలోనైనా, హిపోక్రసీ వుండరాదనే భావం నాది. ఈ దృష్టితోనే నాకచ్చిన కథల్ని చదివాను. కలం పట్టిన ఉత్సాహం కొందంత కనిపించింది. జల్లెడ కతినంగానే పట్టి ఓ రెండు రచనల్ని జల్లెడలోంచి జారిపోతుండా పట్టుకున్నాను. చాలా మంది ఇచ్చిన వాక్యాన్ని, కట్నాల సమస్యకో, మోసగింపు దృష్టికో, స్వార్థ పరత్వానికో అంటగట్టి కల్పన చేశారు కొత్త స్పార్క్ కోసం వెతికాను. "నిజాయితీ", "అవిటి మనసు" దొరికాయి. శారీరకమైన అవిటితనాన్ని నిజాయితీతో జయించిన జంటను గురించి రాసిన దంతులూరి శర్మ, మానసికమైన అవిటితనాన్ని గురించి హెచ్చరికగారాసిన ఇటి, రామారావు పాజిటివ్‌గా రాశారనిపించింది. రచనల్లో నెగిటివ్ అప్రోచ్ ఒక ఫాషనైందిగాని దాని వల్ల పాఠకుల మనస్సులపై దుష్ప్రభావం పడుతుంది కాబట్టి పాజిటివ్ అప్రోచ్ వుంటేనే రచన ప్రయోజనకరమని నా అభిప్రాయం. ఈ ఎన్నికకు ఆ అభిప్రాయం కూడా బేస్. రాసి కన్న వాసికి కీర్తి కన్న ఆర్తికి ప్రాధాన్యం ఇచ్చిన కొద్దీ రచనలో ప్రామాణికత పెరుగుతుందన్న ఒక్క సూచనతో కొత్త రచయితలందరికీ ప్రభవ శుభాకాంక్షలు.

చదివారుగా నిర్మొహమాటంగా నిర్ద్వంద్వంగా సంధించిన శాస్త్రిగారి అభిప్రాయాస్త్రాల్ని! పాతిక సంవత్సరాలుగా జర్నలిజంలో తలపండిన జర్నలిస్టుగానే కాక ఆకాశవాణి ద్వారా ఆంధ్ర శ్రోతలకు పరిచయం ఉన్న ఆయన్ని మళ్ళీ వేరుగా చెప్పనవసరం లేదు కదూ!

"అవిటి మనసు"

క్రాకింగ్ బెల్ మోతవిని తలుపు తెరిచిన పూర్ణ ఎదురుగా సూట్‌కేస్‌తో నిలుచువున్న భారతిని చూస్తూనే ఆనందంగా అరిచింది- "హాయ్! భారతీ" అంటూ. సూట్‌కేస్ అందుకుని లోపలికి నడుస్తూ- "ఏమిటే యింత హఠాత్తుగా ఊడిపడ్డావు? కొంపదీసి మీ ఆయనమీద అలిగి రావటంలేదుకదా!" చిలిపిగా అడిగింది.

"ఫీ నోర్ముయ్! మా ఆయన ఆఫీసు పని మీద బెంగుళూరు క్యాంప్ వెళ్ళాడు. వారం రోజులందాకా రాడు. ఇంట్లో వక్కత్తినే ఉండలేక, ఎలాగూ నిన్ను చూసి చాలాకాలం అయించికదాని రైలెక్కి వచ్చేశాను" అన్నది భారతి సోఫాలో కూర్చుంటూ.

"మంచి పని చేశావు" అంటూ స్నేహితురాలి ప్రక్కన కూర్చుంది పూర్ణ. ఇద్దరూ కబుర్లలో పడ్డారు. కాలేజీ ముచ్చట్లతో ప్రారంభమైన ఆ కబుర్లు తమ తమ సంసారాల గురించి మాట్లాడుకునే స్థాయికి వచ్చిన తర్వాత భారతికి జ్ఞాపకమొచ్చింది.

"ఏమిటే కబుర్లేనా లేక భోజనం సంగతి చూసేదేమైనా ఉందా?" అని అడిగింది.

"నువ్వు స్నానం చేసి వచ్చెయ్యి. ఈలోపల నేను వంట రెడీ చేస్తాను" అని పూర్ణ వంటగదిలోకి నడిచింది.